క్లుప్తంగా

కళాశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వారి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి మందులను అందజేసినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. దీంతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అవసరమున్న వారికి త్వరలో అద్దాలను అందజేస్తామన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, రోజువారి తీసుకునే ఆహార పదార్థాలపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు డా.హరీశ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత పరీక్షలు



ఖిల్లాఘనపురం: విద్యార్థులు ప్రతి రోజు ఉదయం సమయంలో తప్పనిసరిగా పళ్లు శుభ్రపర్చుకోవాలని ఎస్‌వీఎస్ ఆస్పత్రి వైద్యుడు జితేందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని 151 మంది విద్యార్థులకు ఎస్‌వీఎస్ ఆస్పత్రి వైద్య బృందం విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి పళ్ల సమస్యలు ఉండగా.. ఏడుగురికి పాఠశాలలోనే చికిత్స అందించారని, మరో 8 మందికి పుచ్చు పళ్లు ఉండటంతో మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి రావాలని వైద్యులు సూచించారని పాఠశాల హెచ్‌ఎం మునావర్ సుల్తానా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, అరుణ, సులోచన, శశిధర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



పాన్‌గల్: మండలంలోని కదిరెపాడు గ్రామానికి చెందిన బాలయ్యకు రూ.25,500, గురిగింజ మిట్టతండాకు చెందిన దేవమ్మకు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, మంజూరుకు కృషి చేసిన మండల కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయరాం, అరుణ్‌కుమార్, రామకృష్ణ, వెంకటయ్య, కృష్ణయ్య, కుర్మయ్య పాల్గొన్నారు.

'బస్సుజాతా'ను జయప్రదం చేయండి



అమరచింత: వనపర్తిలో ఈనెల 23న జరిగే ఆశావర్కర్ల బస్సుజాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్.రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆశా కార్యకర్తలతో కలిసి బస్సుజాతాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం నెలకు రూ.18 వేలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వారాంతపు సెలవులు, క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాంతమ్మ, సంధ్య, సుజాత, రాజేశ్వరి, శ్యామల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన నివాళి



వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తారాబాయి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాప సభ నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి లేదనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని, వృత్తిపరంగా అందరితో కలిసిమెలిసి, సోదరభావంతో ఉండేవారని గుర్తు చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాల సాధనకు ఆమె చేసిన కృషి మర్చిపోలేనిదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శివాజీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

రైతులకు ఉపయోగపడేలా..



తెల్లరాళ్లపల్లితండాలో ఒండ్రు మట్టి తరలింపు పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- ఉపాధి హామీ పథకంలో ఆరు రకాల పనులకు ప్రాధాన్యం
- మెరుగుపడనున్న పొలాలకు వెళ్లే దారులు

మండల పరిస్థితి..

గ్రామాలు	జాబుకార్డులు
28	15,486
కుటుంబాలు	**కూలీలు**
6,049	9,427

పాన్‌గల్: వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటికి ఈ ఏడాదిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా గుర్తించిన పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి శాఖ పనులను వేగవంతం చేసింది. 2024, అక్టోబర్ 2 నుంచి గ్రామసభల్లో ఆమోదించిన పనులు వచ్చే 2025, మార్చి 31 నాటికి పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం సూచించిన 6 రకాల పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పనుల్లో ఎక్కువ భాగం మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించారు. ఈ ఏడాది దాదాపుగా రూ.6 కోట్లకు పైగా అంచనాతో పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మహిళా శక్తికి భరోసా

మహిళా సంఘాల సభ్యులందరికీ భరోసా కల్పించేలా ఉపాధి హామీ పథకంలో భాగస్వాములను చేయనున్నారు. వారిని స్వయం ఉపాధి వైపు మళ్లించేలా రుణాలిచ్చి ఆవులు, మేకల పెంపకం చేపట్టేలా చేస్తారు. పశువుల షెడ్లు, వర్మీకంపోస్ట్, అజోలా, మొక్కల పెంపకం, బీడు భూములను అభివృద్ధి చేస్తారు.

పొలం బాటలు

గ్రామాల్లో పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చడానికి ఈ సారి మట్టిదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దీంతో పంట పొలాలకు వెళ్లే దారులు మెరుగుపడనున్నడంతో రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి.

ఫల వనాలు

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల ద్వారా రైతులను ప్రోత్సహించడం, వాటికి సబ్సిడీపై బిందు, తుంపర్ల పరికరాలు ఇచ్చేలా చేస్తారు. ఈత, తాటి వనాలను పెంచుతున్నారు. మండలంలో ఎంపిక చేసిన నర్సరీల్లో ఈ పనులు చేపట్టనున్నారు.

జలనిధి

జల సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, ఇంటింటా ఇంకుడు గుంతలు, ఫాంపండ్, ఇంటి కప్పు భాగంలో కురిసిన నీటిని భూగర్భంలోకి ఇంకించడం, చేతి పంపుల వద్ద ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వడం, చెక్‌డ్యాంలు కట్టేలా చర్యలు తీసుకోనున్నారు.

గ్రామీణ పారిశుద్ధ్యం

గ్రామాల్లో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఒక్కో మండలంలో కనీసం 10 చొప్పున ఇంకుడు గుంతలను చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు.

మౌలిక సదుపాయాలు

గ్రామాల్లోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో బాలికలు, బాలురుకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించడం, సిమెంటు రహదారుల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలను నిర్మించనున్నారు. వీటిని మండలానికి ఐదు చొప్పున కేటాయించనున్నారు.

పొలాల రోడ్లతో మేలు



వర్షాకాలంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారి, నడవడానికి కూడా ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఆయా రోడ్లను ఉపాధి హామీ పథకంలో చేపట్టనుండటంతో ఇబ్బందులు తొలుగుతాయి. ముందుగా గుంతలుగా ఉన్న వ్యవసాయ పొలాల రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలి. రోడ్లు మరమ్మతులు చేసే సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతులు సహకరిస్తే పనులు త్వరగా పూర్తవుతాయి.

– ఎనుమల స్వామి, రైతు, పాన్‌గల్

సకాలంలో పనులు పూర్తి చేస్తాం



మండలంలో గ్రామ సభల్లో గుర్తించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. నిర్దేశించిన సమయంలోగా పనులు చేస్తాం. అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో పనులను ప్రారంభించాలని సిబ్బందికి సూచించాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

అంబులెన్స్‌ను వినియోగంలోకి తేవాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు మంజూరయిన 108 వాహనాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. 10 రోజుల క్రితం వీపనగండ్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 108 వాహనాన్ని కేటాయించి, అనంతరం సంగారెడ్డి జిల్లాకు పంపించారని వారు ఆరోపించారు. ఆ వాహనాన్ని వెంటనే స్థానిక ఆస్పత్రికి రప్పించాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఆస్పత్రి వద్ద వితరణగా ఇచ్చిన అంబులెన్స్ ఉండేదని, కొత్త వాహనం మంజూరు కావడంతో దానిని జిల్లా కేంద్రానికి తరలించడంతో ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని దాదాపు 40 గ్రామాల రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకు 30 పడకల ఆస్పత్రి అయినా స్కానింగ్, ఎక్స్‌రే వసతులతో పాటు సరైన వైద్యులు, సిబ్బంది లేరని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, వెంకటేశ్వర్లగౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

డీడీఎన్‌ఎస్ అర్చకుల వేతనాలు పెంచాలి



వనపర్తి టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో అర్చకుల సంక్షేమం కోసం, ధూప, దీప నైవేద్యం పథకానికి అమలు చేసిన వేతనాలనే నేటికీ కొనసాగిస్తున్నారని వనపర్తి అర్చకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకొని వేతనాలను పెంచాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వనపర్తి స్వధర్మ ధూప, దీప అర్చకుల సంఘం ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన అర్చకులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చూడాలని, ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించాలని కోరారు. కార్యక్రమంలో అర్చకుల ప్రతినిధులు శఠగోపం శ్రీనివాసచారి, శంకాకశర్మ, బాలకృష్ణ, బుచ్చిలింగం, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

ఆత్మకూర్: మండలంలోని పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి విడుదల చేశారు. ఆత్మకూర్ మండలంలో మొత్తం 114 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటికి సంబంధించిన అభ్యంతరాలు ఇది వరకే స్వీకరించినట్లు తెలిపారు.

కొత్తకోట రూరల్: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో గల వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంపీఓ సుదర్శన్ విడుదల చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నోటీస్ బోర్డుపై పొందుపర్చారు.



ఆత్మకూర్‌లో పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేస్తున్న అధికారులు

లగచర్ల రైతులకు న్యాయం చేయాలి

సాక్షి, నెట్‌వర్క్: లగచర్ల రైతులకు ఉగ్రవాదుల వలే బేడీలు వేసి జైలుకు తరలించడం సరికాదని, వారికి న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశాల మేరకు స్థానిక నాయకులు మంగళవారం జిల్లావ్యాప్తంగా లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి ప్రజలే బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు.

■ కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కొడంగల్ రైతులపై పెట్టిన అక్రమ కేసులను కొట్టివేయాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీసం చెన్నకేశవరెడ్డి, ఆకుల శీను, కొండారెడ్డి, ఎద్దుల నాగేష్, వడ్డె శ్రీను, యాదగిరి, గాడిల ప్రశాంత్, కటికె శ్రీను, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

■ అమరచింత, ఆత్మకూర్ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు మంగమ్మ, గాయత్రి, ఎస్‌ఏ రాజు, వీరేశలింగం, శ్రీధర్‌గౌడ్, కోటేష్, అక్కల నరసింహులుగౌడ్, మరెడ్డి నరేష్‌రెడ్డి, బాలరాజు, అబ్రహం, జింకల రవి తదితరులు పాల్గొన్నారు.

■ వనపర్తి మండలంలోని పెద్దగూడెంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, కొండన్న, భాస్కర్‌గౌడ్, మహేశ్వర్ రెడ్డి, ధర్మనాయక్, తిరుమలయ్య పాల్గొన్నారు.

■ గోపాల్‌పేట, రేవల్లి మండల కేంద్రాలు, బుద్దారం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించి నిరసన తెలిపారు.

■ ఖిల్లాఘనపురంలో రాళ్ల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బాల్ రెడ్డి, చిన్న అంజనేయులుగౌడ్, చెన్నారెడ్డి, గొడుగు సత్యం, బుచ్చిబాబుగౌడు, పెద్ద అంజనేయులుగౌడు తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గోపాల్‌పేటలో..



అమరచింతలో..

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



మదనాపురంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ ఫరూక్‌హుస్సేన్

మదనాపురం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను మంగళవారం ఎంఈఓ ఫరూక్ హుస్సేన్ సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న వసతులను పరిశీలించారు. ప్రత్యేకంగా పదో తరగతి విద్యార్థులు ఫిజికల్ సైన్స్‌లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. పేద విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కాకరకాయ ఫ్రై, పప్పు, సాంబారు, పెరుగు, ఉడకబెట్టిన కోడి గుడ్డు తదితర వాటిని రుచి చూశారు.



అప్పారెడ్డిపల్లిలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ జయశంకర్

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఖిల్లాఘనపురం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని అప్పారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ.. భయాందోళనకు గురికాకుండా ఉపాధ్యాయులు చెప్పే విషయాలను క్రమం తప్పకుండా చదవాలని సూచించారు. ప్రతి రోజు పాఠ్యాంశాల్లోని ముఖ్యమైన ప్రశ్నలు, సమాధానాలను పఠించాలనాలన్నారు. ఏదైనా సమస్యలు వస్తే వెంటనే ఉపాధ్యాయులతో నివృతి చేసుకోవాలన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 777 లో 9 గుంటల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న అధికార పార్టీ నాయకుడిపై తగు చర్యలు తీసుకోవాలని దళిత కుటుంబం కోరుతున్నారు. ఈ విషయంపై మంగళవారం ముద్దలగండ్ల శాంతయ్య, చెన్నమ్మ దంపతులు మాట్లాడుతూ.. తమ పూర్వీకులు గ్రామానికి చెందిన తంబళ్ల బాలమ్మ కుటుంబం వద్ద 40 ఏళ్ల క్రితం వెట్టి చాకిరీ చేయడంతో సర్వే నెం.777 లో 9 గుంటల భూమిని దాన పూర్వకంగా కాగితం రాసి ఇచ్చారన్నారు. రెవెన్యూ రికార్డులో తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని తంబళ్ల బాలమ్మ వారసులు హద్దురాళ్లు పాతించి తమకు స్వాధీనం చేశారన్నారు. ఈ భూమికి సంబంధించి పహాణీలు, పాత పట్టా పాసు పుస్తకం పొందినట్లు వారు తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా రికార్డులో తంబళ్ల బాలమ్మ పేరు ఉన్నందున ఆమె వారసులు దుర్బుద్ధితో వెట్టి చాకిరీ కింద దాన పూర్వకంగా ఇచ్చిన భూమిని మళ్లీ దౌర్జన్యంగా అక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. తమ పేరు మీద ఉన్న భూమిని పట్టా మార్పిడి చేయించుకున్న తంబళ్ల బాలమ్మ వారసులు బ్రహ్మయ్య, మల్లికార్జున్, శివయ్యపై తగు చర్యలు తీసుకుంటూ తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు. ఈ విషయంపై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై తంబళ్ల బాలమ్మ వారసులను వివరణ కోరగా 'మేము ఎవరి భూమిని అక్రమించుకోలేదని, వారసత్వంగా వచ్చిన భూమిని మా పేరు మీద' మార్చుకున్నామని తెలిపారు. దానికి సంబంధించిన అన్ని కాగితాలు ఉన్నాయి. తమ కుటుంబమే ప్రభుత్వ పాఠశాలకు ఎన్నో ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చామని, బీసీ ప్లాట్లకు కూడా ఇచ్చామన్నారు. 9 గుంటల భూమిని ఆక్రమించుకోవాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. దీనిపై విచారణకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న శాంతయ్య కుటుంబ సభ్యులు

నైపుణ్యాలు వెలికి తీసేందుకే పద్య పోటీలు

పాన్‌గల్: విద్యార్థులల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రతి వారం విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహిస్తూ నగదు పారితోషికం అందజేస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పద్య పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈఓ నగదు పారితోషికం అందజేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో (1నుంచి 5 వ తరగతి) ఎం.గిరిజ (ఎంపీపీఎస్, శాగాపూర్), జూనియర్స్ విభాగంలో (6వ తరగతి నుంచి 7వ తరగతి) టీ.ప్రవీణ్ (పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల), సీనియర్స్ విభాగంలో (8 నుంచి 10వ తరగతి వరకు) పల్లవి (పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల) విజేతలుగా నిలవగా.. ఒక్కొక్కరికి ఎంఈఓ రూ. 100 నగదు అందజేశారు. ఈ పోటీలకు జడ్జిగా బైరోజు చంద్రశేఖర్ వ్యవహరించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

శ్రీశైలం నిర్వాసితుల సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

చిన్నంబావి: శ్రీశైలం ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన వారికి నేటికీ న్యాయం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ధారాసింగ్ ఎంపీ ఈటల రాజేందర్‌కు వివరించారు. ఢిల్లీలోని ఎంపీ కార్యాలయంలో ఈటలను కలిసిన ఆయన శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం చేయాలని హైకోర్టు నుంచి ఉత్వర్వులు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోవటం లేదన్నారు. ఇదే విషయంలో పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరారు. వెంటనే స్పందించిన ఈటల స్థానిక కలెక్టర్‌కు ఫోన్ చేసి హైకోర్టు తీర్పును వివరించారు. వారికి తక్షణమే సహాయం అందించాలని, రాష్ట్ర ప్రభుత్వానికి 8 వారాల గడువు ఇస్తున్నామని, అప్పటిలోగా వారికి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా వనపర్తి జిల్లాలో పర్యటించాలని కోరడంతో త్వరలోనే వస్తానని, ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారన్నారు. కార్యక్రమంలో రామన్‌గౌడు పాల్గొన్నారు.

ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ ప్రస్తావనపై హర్షం

ఆత్మకూర్: నియోజకవర్గంలోని ఆత్మకూర్, మక్తల్‌ను రెవెన్యూ డివిజన్లుగా గుర్తించాలని శాసనసభ్యుడు డాక్టర్ వాకిటి శ్రీహరి అసెంబ్లీలో ప్రస్తావించడంతో కాంగ్రెస్ నాయకులు ఆత్మకూర్‌లో సంబురాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆత్మకూర్‌లో డివిజన్ సాధన కమిటీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, గంగాధర్‌గౌడ్, గడ్డం శ్రీను, సుదర్శన్ శెట్టి, యాదగిరిశెట్టి, అజ్మత్, దామోదర్, అశోక్, మహేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు మంగళవారం కొనసాగింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లుతో పాటు రేషన్‌కార్డులు, పింఛన్ మంజూరు చేయాలని ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ పెద్ద ఖాజా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం మరో రూ.5 లక్షలు మంజూరు చేస్తే పేదలకు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవిప్రసాద్, మాజీ సర్పంచ్ కాంతమ్మ, ప్రజా నాట్యమండలి నాయకులు మహబూబ్‌సాని, నాయకులు ఖాజాహుస్సేన్, రేవతమ్మ, సరోజ, వెంకటస్వామి, చిన్నరజాక్, హనుమంతు, హేమలత, మణెమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

నూతన భవనంలోకి మార్పు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం నూతనంగా నిర్మించిన భవన సముదాయంలోకి మార్చినట్లు తహసీల్దార్ జేకే మోహన్ తెలిపారు. బుధవారం కొత్త కార్యాలయంలోనే విధులు నిర్వర్తిస్తునట్లు పేర్కొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక



అమరచింత: పట్టణంలోని రాంనగర్ కాలనీలో మంగళవారం బీజేపీ బూత్ కమిటీని ఎన్నుకున్నామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు. బూత్ అధ్యక్షుడిగా కుమార్, కార్యదర్శిగా శ్రీకాంత్, సభ్యులుగా దేవర్ల రవి, హమాలి వెంకటేష్, పాండు ను నియమించారు. కార్యక్రమంలో రాకేష్ శెట్టి, తోకలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని రైతు వేదికలో నార్లాపూర్ చెంచు గూడెం, మొలచింతపల్లి చెంచుగూడెం, అమరగిరి చెంచుగూడెం, ఎల్లూరు చెంచుగూడెలాకు చెందిన చెంచులకు విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, వ్యవసాయంపై ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ చిన్న హుస్సేన్, ఆర్డీటీ సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ రాముడు, తదితర చెంచులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.